క్లుప్తంగా

ట్రినిటి కళాశాలలో 'బిగినర్స్ బాష్'



విజేతలకు మెమొంటో అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు 'బిగినర్స్ బాష్' పేరిట ఆదివారం వేడుకలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మెమొంటోలు అందించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. వైస్ ప్రిన్సిపాల్ నీతారెడ్డి, అధ్యాపకులు అజయ్‌కుమార్, రాంచందర్, సంజీవరెడ్డి, సరిత, అశ్విని పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో నాయకులు

జ్యోతినగర్: భారతీయ జనతా పార్టీ జిల్లాలో 50వేల సభ్యత్వం పూర్తి చేసుకుందని ఆ పార్టీ ఎన్నికల రిటర్నింగ్ సహాయ అధికారి క్యాతం వెంకటరమణ తెలిపారు. ఎన్టీపీసీ ఏరియాలో ఆదివారం చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాధారణ సభ్యత్వం గడువు ముగియనుండడంతో 100 మందిని సాధారణ సభ్యులుగా చేర్పించిన నాయకులు.. క్రియాశీల సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకోవడం శుభపరిణామమన్నారు. బీజేపీ ప్రభుత్వంలోనే ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారని తెలిపారు. క్రియాశీల సభ్యత్వం కోసం నాయకులు మిట్టపల్లి సతీశ్, తోట కుమారస్వామి, సిలివేరి అంజి, చిరంజీవి, మంద శ్రీనివాస్, పల్లికొండ నర్సింగ్, గోశిక రమేశ్ తదితరులు దరఖాస్తు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



సంజన

ఎలిగేడు: కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీలు జరిగాయి. అండర్–14 కబడ్డీ బాలికల విభాగంలో ఎలిగేడు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి శివరాత్రి సంజన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సంజనను పాఠశాల హెచ్ఎం గంద్ర దేవేందర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ ప్రణయ్‌కుమార్, టీచర్లు అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట వివేకానంద పాఠశాలలో 2002–03లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గ్రామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాలలో తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

కార్తీక పౌర్ణమి దీపదానం



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో పూజారి మహేశ్‌కు ఆదివారం పలువురు దీపదానం చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజారికి దీపదానం చేస్తే దోషాలు తొలుగుతాయన్న ఉద్దేశంతో దీపదానాలు చేస్తున్నట్లు తెలిపారు. శివాలయంలో క్షీరాభిషేకం, జలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ ఉన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించడంపై యాదవ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. యాదవ సంఘం నాయకులు బక్కతట్ల కుమార్‌యాదవ్, సింగనవేన సదయ్యయాదవ్, సమ్మయ్య యాదవ్, పెగడ కుమార్‌యాదవ్, బక్కతట్ల వినీత్‌యాదవ్, చుంచు లింగయ్యయాదవ్, తాత రాజయ్యయాదవ్, పోశాని కొమురయ్య యాదవ్, జనార్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

'పల్లెవెలుగు' పంపించండి

- బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, ప్రయాణికుల వేడుకోలు
- ఆరేళ్లు గడుస్తున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- వినతిపత్రాలు ఇచ్చినా స్పందించని అధికారులు



బస్సు కోసం రోడ్డుపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లోని విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల కోసం ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే. పాలకుర్తి మండలంలోని ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్ జిల్లా పరిషత్ పాఠశాలకు సుమారు 6 కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 2018లో మిషన్ భగీరథ పైప్‌లైన్ తవ్వకాలతో ఆర్టీసీ బస్సు సౌకర్యం నిలిపివేశారు. ఆరేళ్లుగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు గ్రామాల పరిధిలో సుమారు 60 మంది విద్యార్థులు స్కూల్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉన్నారు. ప్రతీరోజు గోదావరిఖనిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. పేద విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

పట్టించుకోని ఆర్టీసీ అధికారులు..

ఆరేళ్లుగా గ్రామాలకు బస్సు రాకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పేరుతో బస్సును నిలిపివేయడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ప్రైవేట్ వాహనాలు దొరక్క అవస్థలు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి బస్సు నడిపించాలని వారు కోరుతున్నారు.

కొత్త బస్సులు రాగానే ప్రారంభిస్తాం

గోదావరిఖని నుంచి ఎల్కలపల్లి మీదుగా బస్సు సౌకర్యం కల్పించేందుకు కొత్త బస్సుల కోసం ప్రయత్నాలు ప్రారంభించాం. మహాలక్ష్మి పథకంతో బస్సుల వినియోగం పెరిగింది. బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో కొత్త బస్సులకు దరఖాస్తు చేశాం. కొత్త బస్సులు రాగానే గోదావరిఖని నుంచి ఎల్కలపల్లి మీదుగా బస్సు ప్రారంభిస్తాం. – నాగభూషణం, ఆర్టీసీ డిపో మేనేజర్, గోదావరిఖని

టైమ్‌కి వెళ్లలేకపోతున్నాం



ప్రతీరోజు ఉదయం ఎల్కలపల్లి నుంచి గోదావరిఖనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. కళాశాలకు ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది. సమయానికి ఆటోలు కూడా అందుబాటులో లేకపోవడంతో కళాశాలకు సమయానికి చేరుకోలేకపోతున్నాం.
– వడ్లకొండ హరిణి, ఇంటర్ విద్యార్థి, ఎల్కలపల్లి

నడిచి వెళ్లాల్సిన పరిస్థితి



ఎల్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల మీదుగా గోదావరిఖనికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. బస్ సౌకర్యం లేకపోవడంతో ఎల్కలపల్లి నుంచి ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్ వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.
– మేకల సాహిత్య, విద్యార్థి, ఎల్కలపల్లి

అధికారులు స్పందించాలి



ఎల్కలపల్లిలో రోడ్డు వెడల్పులో భాగంగా, గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం కోసం ఆరేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి ఎల్కలపల్లి నుంచి గోదావరిఖనికి బస్సు సౌకర్యం కల్పించాలి.
– బండారి ప్రసాద్, ఎల్కలపల్లి

ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలు పెడితే సహించం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు కొర్రీలు పెడితే సహించబోమని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని వెన్నంపల్లి, కూనారం, మంగపేట, జాఫర్‌ఖాన్‌పేట, ఇదులాపూర్ గ్రామాల్లో ఆదివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంగ్రెస్ సర్కార్ రైతు పక్షపాతిగా రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, సన్నవడ్లకు ఆరుసూరైనా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, సీఈవో విజేందర్, ఏపీఎం కనుకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, సజ్జుబాయి, మొగిలి పాల్గొన్నారు.

ఉచితంగా షుగర్ పరీక్షలు



కోల్‌సిటీ: రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గానగర్ కాలనీలో నిర్వహించిన ఉచిత మధుమేహ శిబిరానికి స్పందన లభించింది. సుమారు 200మందికి పైగా కాలనీవాసులు శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. వ్యాధుల భారిన పడకముందే ప్రతి ఒక్కరూ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్ కోరారు. అనంతరం లయన్‌క్లబ్ ప్రతినిధి ఆంజనేయులు సహకారంతో ఉచిత అల్పాహారం కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యోగాల భర్తీకి కృషిచేస్తా



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్: లెక్చరర్లు, ప్రైవేట్ ఉద్యోగులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. స్థానిక యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నాని తెలిపారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ సమస్య రూపుమాపుతానని, ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ నివాసానికి వెళ్లి ఆయనను సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎర్రంశెట్టి మునిందర్, తానిపర్తి తిరుపతిరావు, ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల కిరణ్, ప్రతినిధులు కాసర్ల మధుసూదన్ రెడ్డి, కందుల సునీల్, ముత్యం నరేశ్, మద్దెల రామకృష్ణ, ఎంబడి దేవేందర్, అంజి, సంతోష్, బైరగోని రవీందర్‌గౌడ్, చిలగాని విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామశివారులో ఇటీవల బైక్ అదుపు తప్పి కిందపడడంతో కేశోరాం కాంట్రాక్ట్ కార్మికుడు సందవేని గట్టయ్య మృతిచెందాడు. అతడి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు, కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి పరామర్శించారు. మృతుని స్వగ్రామమైన ధర్మారం మండలం గోపాల్‌రావుపేటలో నిర్వహించిన దశదిన కర్మకు హాజరైన కౌశికహరి గట్టయ్యకు నివాళి అర్పించారు. వారి కుటుంబసభ్యులకు రూ.5వేల నగదు అందజేశారు. గట్టయ్య కుమారుడికి కంపెనీలో ఉపాధి కల్పించాలని వారు కౌశికహరికి విన్నవించారు. కాంట్రాక్ట్ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, బత్తిని సతీశ్, సందవేన పోషమల్లు, ముల్కనూరి శ్రీధర్, కొమ్ము రాయమల్లు, నెరువట్ల సతీశ్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి కోరారు. ఇంటింటా కుటుంబ సర్వేను ఆదివారం ఆమె పరిశీలించారు. ప్రతీ కుటుంబం వివరాలు నమోదు చేయాలని, నమోదు చేసిన ఇంటికి తప్పకుండా సర్వేకు సంబంధించిన స్టిక్కర్లు అంటించాలని సూచించారు.

మూడోరోజు ఇంటింటికీ స్టిక్కర్లు..

ఎలిగేడు: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఆదివారం మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ స్టిక్కర్లు వేశారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో భాస్కర్‌రావు సందర్శించి, పరిశీలించారు.

ఓదెల: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే వేగవంతమైంది. ఆదివారం మండలంలో 10మంది సూపర్‌వైజర్లు, 97మంది ఎన్యూమరేటర్లు సర్వే చేశారు.

• నగదు చోరీ.. యువకుడి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీలోని ఓ అర్చకుడి బ్యాగ్‌లో డబ్బులు దొంగతనానికి పాల్పడిన రమేశ్‌రెడ్డి (23)ని ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం కుమారస్వామి నగర్‌కు చెందిన రమేశ్‌రెడ్డి స్థానిక అయ్యప్ప ఆలయంలోని అర్చకుడి బ్యాగ్‌లో నుంచి మూడురోజుల నుంచి రోజూ నగదు అపహరిస్తున్నాడు. ఆదివారం దర్శనం పేరుతో వచ్చిన రమేశ్‌రెడ్డి అర్చకుడి బ్యాగ్ నుంచి నగదు దొంగలించి పారిపోతున్నాడు. అక్కడే ఉన్న భక్తులు పట్టుకునేందుకు యత్నించగా ఓ భక్తుడి చెయ్యిని కొరికాడు. భక్తులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఆలయ అర్చకుడు పాండే ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం జైలుకు పంపినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కాగా సదరు వ్యక్తిపై గతంలో కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి సేవించిన కేసు ఉన్నట్లు పేర్కొన్నారు.

• ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి జనగామ గ్రామానికి చెందిన జనగామ శ్రీనివాస్(45) శనివారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి తన గదిలో ఉరేసుకున్నాడు. విషయన్ని గమనించిన కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముత్తారం: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడిన మండలంలోని అడవిశ్రీరాంపూర్‌కు చెందిన గాజర్ల హరీశ్(30) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హరీశ్ అక్టోబర్ 12న దసరా రోజు మండలంలోని మచ్చుపేటలోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. తిరుగు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ ప్రవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య సౌజన్య ఉంది.

• చికిత్స పొందుతూ వృద్ధురాలు..

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపుల గ్రామానికి చెందిన వడ్లూరి కొమురమ్మ(60) అనే వృద్ధురాలు ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. పొత్కపల్లి ఏఎస్సై అనుమాండ్ల కిషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొమురమ్మ 19ఏళ్ల నుంచి మతిస్థిమితం లేకపోవడంతో పాటు మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడిన నయం కాలేదు. దీంతో నవంబర్ 30న ఇంట్లోని పురుగుల మందుతాగింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం జమ్మికుంట ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త వడ్లూరి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

• సీపీఎం మండల కార్యదర్శిగా అశోక్

పెద్దపల్లిరూరల్: సీపీఎం పెద్దపల్లి మండల కార్యదర్శిగా కల్లెపల్లి అశోక్ నియమితులయ్యారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి యాకయ్య ప్రకటించారు. మండల కార్యదర్శిగా అశోక్, సభ్యులుగా సీపెల్లి రవీందర్, జిల్లెల ప్రశాంత్, మోదుంపల్లి శ్రావణ్, వెంకటస్వామి, ఖాజాను నియమించినట్లు యాకయ్య పేర్కొన్నారు.

• మాల మహిళా సంఘం అధ్యక్షురాలిగా కొత్తపల్లి సౌజన్య

ధర్మారం: మాల మహిళా సంఘం మండల అధ్యక్షురాలిగా కొత్తపల్లి సౌజన్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని మాల సంఘం భవనంలో ఆదివారం మహిళా సంఘం సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో పలు సమస్యలపై చర్చించిన తర్వాత కమిటీని ఖరారు చేశారు. అధ్యక్షురాలిగా కొత్తపల్లి సౌజన్యను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా దేవి రమను ఎన్నుకున్నారు.

• గుడి పేరు మీద వసూలు చేస్తే ఊరుకోం

గోదావరిఖని: గుడి పేరు మీద సింగరేణి కార్మికుల జీతాల్లో వసూలు చేస్తే ఊరుకోబోమని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. గుడి పేరు మీద చేసే వసూళ్లను గుడికే అప్పగించాలన్నారు.

• సాంకేతిక సమస్యతో గుడి పేరుతో వసూలు

గోదావరిఖని: సాంకేతిక సమస్యతో గుడి కమిటీ పేరుతో కార్మికుల నుంచి వసూలు చేసినట్లు ఏఐటీయూసీ నాయకులు కె.స్వామి, మడ్డి ఎల్లాగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో ఏటాలాగే ఈసారి కూడా తమ యూనియన్‌కు చందాలు ఇచ్చారన్నారు. తమ యూనియన్ ద్వారా కార్మికుల నుంచి ఆథరైజేషన్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. కొన్ని టెక్నికల్ ప్రాబ్లమ్స్ రావడంతో ఆ రుసుమును గుడికమిటీ (1835) కోడ్ మీద వసూలు చేసినట్లు పేర్కొన్నారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో రోడ్డుపై డ్రైనేజీ లీకై మురుగునీరు రోడ్డుపై పారుతోంది. రామగుండం కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పైపులైన్ మరమ్మతు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



చిన్నారులతో జీఎం లలిత్‌కుమార్ దంపతులు

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమాన్ని ఆదివారం ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్ దంపతులు సందర్శించారు. ఆశ్రమంలోని పిల్లలకు స్వీట్లు, కేక్స్ అందజేసి వారితో కాసేపు ఆనందంగా గడిపారు. వారితో ముచ్చటించిన లలిత్‌కుమార్ దంపతులు పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆశ్రమ నిర్వాహకులతో పాటు మద్దెల దినేశ్ పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎంగా వెంకటయ్య



పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రతినిధులు

గోదావరిఖని: ఆర్జీ–2 జీఎంగా బండి వెంకటయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జీఎం చాంబర్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బాధ్యతలు స్వీకరించిన జీఎంను సీఎంవోఏఐ ప్రతినిధులు సన్మానించారు. సీఎంవోఏఐ ప్రతినిధి నర్సింహులు, అఫిషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్, వకీల్‌పల్లి ప్రాజెక్ట్ అధికారి ఎ.నెహ్రూ, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, సివిల్ డీజీఎం ధనుంజయ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, స్టోర్స్ డీజీఎం సుజన్‌మెహ్రా, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, వీకేపీ మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఎస్ఈ సదానందం, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, నిమ్ ఇన్‌చార్జి ఎస్డీఎం హుస్సైనీ, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, ఎస్ఈ పర్చేజ్ పండరీనాథ్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తాం



బాధ్యతలు స్వీకరిస్తున్న పాలకవర్గం

కాల్వశ్రీరాంపూర్: రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జి సెక్రటరీ ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో ఆదివారం ఏఎంసీ నూతన పాలకవర్గం చైర్మన్‌గా తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్‌గా సబ్బని రాజమల్లు, డైరెక్టర్లుగా శివనాత్రి కిషోర్, దాగేటి రాంచంద్రం, కోమల మల్లమ్మ, నార్ల విజయలక్ష్మి, దొమ్మటి రాజయ్య, కూనారం రమేశ్, దోబిల సంపత్, ఎనగంటి రవి, కలవేని రాజయ్య, కదురు మల్లయ్య, సలిగంటి రాంచంద్రం, అబ్దుల్ రహీం బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గాన్ని, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌ను రైతులు సన్మానించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, వివిధ గ్రామాల రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ బాధ్యతలు స్వీకరణ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ గణేశ్ బాధ్యతలు ఆదివారం స్వీకరించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి మనోహర్ పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. అనంతరం వారిని సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అమీనుద్దీన్, కందునూరి పోచాలు, అప్పాల తిరుమల, బావు రాజేందర్, పాపని లక్ష్మీనారాయణ, బొజ్జ మల్లయ్య, పోచంపల్లి బక్కన్న, బండ శంకర్, గడ్డం రాజిరెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్, పల్ల శ్రీనివాస్, కొమురవెల్లి శ్రీకాంత్ ఉన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా మహేశ్వరి

గోదావరిఖని: సీపీఎం గోదావరిఖని పట్టణ కార్యదర్శిగా అనుముల మహేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజులు జరిగిన పట్టణ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ సభ్యులుగా వేల్పుల కుమారస్వామి, మెండె శ్రీనివాస్, మేదరి సారయ్య, వడ్లకొండ నాగమణి, ఉపేందర్, జన్నే కొమురయ్య ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి కళోత్సవాల్లో ప్రతిభ



ప్రశంస పత్రం అందుకుంటున్న శివ నాగరాజు

జ్యోతినగర్: రాష్ట్రస్థాయి కళోత్సవాల్లో ఎన్టీపీసీ రామగుండం విద్యార్థి శివనాగరాజు ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రం అందుకున్నారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కళోత్సవాల్లో అన్నపూర్ణకాలనీ విశ్వభారతి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న శివనాగరాజు ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. పాఠశాల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ టీచర్లు విద్యార్థిని అభినందించారు.

నేడు ధాన్యం కేంద్రాలు ప్రారంభం

కమాన్‌పూర్: మండంలోని కమాన్‌పూర్, సిద్ధిపల్లె, ముల్కలపల్లి, రాజాపూర్, గుండారం, పేరపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించనున్నట్లు ఐకేపీ ఏపీఎం శైలజకాంతి తెలిపారు.